క్లుప్తంగా

శాగాపూర్‌లో పశువైద్య శిబిరం



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం పాడి పశువుల గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి డా.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా పాడి పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేసి ఇంజక్షన్లు ఇచ్చామన్నారు. శిబిరంలో 8 పశువులకు కృత్రిమ గర్భధారణ, 48 దూడలకు నట్టల నివారణ మందులను తాగించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్, డాక్టర్ రాజేష్, గోపాలమిత్రలు శ్రీనివాసులు, రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్స్ యూనియన్, ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవ్ -2025లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సత్తా చాటి బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు చక్రపాణిరెడ్డి, షకీల్‌అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయానికి విరాళం

కొత్తకోట: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయానికి నివేదిత విద్యా సంస్థల యాజమాన్యం ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం రూ.1,05,116లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ నెల 13, 14, 15వ తేదీల్లో జరిగే ఆలయ ప్రారంభ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీకృష్ణ కమిటీ సభ్యులు కోరారు.

‘యుద్ధభేరీ’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొత్తకోట: యూపీఎస్‌కు వ్యతిరేకంగా చేపడుతున్న యుద్ధభేరీ పోస్టర్‌ను గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. దీనిపై మార్చి 2న పాత పెన్షన్ కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, సీపీఎస్ సంఘం ఉపాధ్యాయులు మద్దిలేటి, రాజేంద్రప్రసాద్, సాయిచందర్‌రెడ్డి, మోహన్‌బాబు, నరేష్, మాధవరావు, వెంకటరమణ, సురేష్‌రెడ్డి, నరహరి, రమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో..



కొత్తకోట: హీరో కంపెనీ నూతనంగా సరికొత్త హంగులతో ప్రవేశపెట్టిన హీరో డెస్టినీ 125 స్కూటీని పట్టణంలోని పద్మావతి హీరో షోరూంలో గురువారం స్థానిక ఆరోగ్య వాకింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు, విద్యావేత్త పలుస శేఖర్‌గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరో కంపెనీ సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ద్విచక్ర వాహనాలను ప్రవేశపెట్టడంతో పాటు ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని పొందుపరుస్తూ టూ వీలర్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కొత్తకోట టూ వీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రఫీక్, శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ రంగస్వామి, షోరూం సిబ్బంది జగన్, కార్తీక్, పల్లవి, సంధ్య, మీనాక్షి, సహదేవ్, విజయ్, స్థానిక టూవీలర్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

బాధ్యతగా ఉండాలి

అమరచింత: మండలంలోని మస్తీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చట్టాలతో పాటు సమాజంలో ఎలా జీవించాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన కానిస్టేబుల్ జ్యోతి, శాంతిప్రియ గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటన్న, ఉపాధ్యాయులు ప్రభాకర్, పాండు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం..

- గూడెం గ్రామానికి జీటీ రోడ్డు మంజూరు
- నేడు భూమిపూజ



కంకర పరచి ఉన్న గూడెం రోడ్డు

చిన్నంబావి: మండల కేంద్రం నుంచి గూడెం గ్రామానికి చేరుకోవాలంటే ఇన్నాళ్లు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యేవారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో రూ.2.80 కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభం కానుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గూడెం గ్రామం నుంచి వయా కాశిరెడ్డివాగు మీదుగా మండల కేంద్రానికి చేరుకోవాలంటే దాదాపు నాలుగు కిలోమీటర్లకు పైగా మట్టి రోడ్డు ఉండటంతో దుమ్ముతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఆరేళ్ల క్రితం ఇదే రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయి రోడ్డు పనులను ప్రారంభించినా.. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే అసంపూర్తిగా రోడ్డుపై కంకర పరచి వదిలేశారు. రోడ్డుపై కంకర పరచి వదిలేయడంతో బైక్‌పై వేళ్లే వారు అదుపు తప్పి కిందపడి గాయపడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇదే రోడ్డుపై గతంలో కాశిరెడ్డివాగులో బస్సు ఇరుక్కుపోయిన ప్రయాణికులు అవస్థలు పడిన ఘటనలు ఉన్నాయి.

కల నెరవేనుంది

చిన్నంబావి మండల కేంద్రం నుంచి గూడెం, బెక్కెం, మియాపూర్, గడ్డబస్వాపురం గ్రామాలకు వేళ్లేందుకు ఉన్న ప్రధాన రోడ్డులో కాశిరెడ్డివాగుపై బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో తరతరాలుగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణానది పరివాహకంలో ఉన్న ఈ వాగు కృష్ణానదిలో నీరు ఎక్కువగా వచ్చిన సమయంలో ఈ వాగుపై రాకపోకలు జరిగేవి కావు. ఏళ్లుగా ఈ బ్రిడ్జి నిర్మాణం కావాలని అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు విన్నవించుకున్న ప్రయోజనం లేకపోయింది. గతేడాది కాలంగా ఈ బ్రిడ్జి కోసం అనేకసార్లు స్థానిక మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన ఈ నెల 7వ తేదీన కాశిరెడ్డివాగు బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో..



ఏళ్లుగా గూడెం గ్రామానికి రోడ్డు బీటీ నిర్మాణం చేపట్టాలని పలుసార్లు అధికారులను,ప్రజాప్రతినిధులను అడిగిన లాభం లేకపోయింది.గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మిస్తామని చెప్పి పనులను మధ్యలోనే వదిలేయడంతో ఆ రోడ్డుపై వేళ్లేందుకు చాల ఇబ్బందులు పడ్డాం.అనేకసార్లు రోడ్డు పై కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. ఇన్నాళ్లకు రోడ్డు,కాశిరెడ్డి వాగు పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండటంతో ఇన్నాళ్లకు మా కళ నేరవేరింది.

– సుధాకర్‌నాయుడు, గూడెం గ్రామం

ఇబ్బందులు ఎదుర్కొన్నాం



చిన్నంబావికి రావాలంటే రోడ్డు నిర్మాణం లేక పెద్దదగడ నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది. నాలుగు కిలోమీటర్లు దూరం ఉండే చిన్నంబావి వెళ్లాలంటే ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించే దుస్థితి ఉండేది. అదేవిధంగా రోడ్డు నిర్మాణం లేకపోవడంతో బస్సు కూడా సరిగా వచ్చేది కాదు. చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాం. ఇంతకాలానికి రోడ్డు నిర్మాణం చేపడుతుండటంతో సంతోషంగా ఉంది.

– మహేష్, గూడెం

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పుస్తకాలు అందుకున్న పదో తరగతి విద్యార్థులతో ఎంఈఓ, ఎస్‌ఓ

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుతూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్జెక్టుల వారిగా చర్చిస్తూ మంచి ఫలితాలు సాధించేందుకు అవసరమైన మెలకువలు, పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ రచించిన ‘టాప్ ర్యాంకు నూరు సూత్రలు’ అనే పుస్తకాలను విద్యార్థులకు అందించారు. పుస్తకంలో ఉన్న అంశాలను అర్థం చేసుకొని వాటిని పాటిస్తే లక్ష్యం సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ హేమాలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టాలెంట్ పరీక్షలు

మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గురువారం టాలెంట్ పరీక్షలను నిర్వహించినట్లు పాఠశాల జీహెచ్ఎం జమీల్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఉండే భయాన్ని తొలగించడంతో పాటు అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రతిభ పరీక్షను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ పరీక్షకు తోడ్పాటునందించిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులను హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు శివ, పరమేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



ఎస్‌ఐకు నగదు అందజేస్తున్న మూలమళ్ల గ్రామస్తులు

ఆత్మకూర్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. గురువారం మండలంలోని మూలమళ్ల గ్రామంలో సీసీ కెమెరాల ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలని, సొంతంగా డబ్బులను సమకూర్చుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా గ్రామస్తులు రూ.80 వేలు సమకూర్చి సీఐ, ఎస్‌ఐలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజు, ప్రతాప్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, ప్రవీణ్, అశోక్, సుధాకర్, భీమన్న, రాజశేఖరరెడ్డి, ఆనంద్‌గౌడ్, ఏఎస్‌ఐ రోషయ్య, సిబ్బంది రామకృష్ణ, సురేందర్, నర్సింహ, ఇమామ్ పాల్గొన్నారు.

‘దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి’



మాట్లాడుతున్న సత్యశీలారెడ్డి

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని లేదంటే ప్రజలు మరింత ఛీత్కరించుకునే అవకాశం ఉంటుందని ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారికే కండువాలు కప్పి.. కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారని ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పెద్ద నాయకులే ఇలాంటి రాజకీయాలు చేయడం తగదన్నారు. నిజమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికీ వెళ్లలేదని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వారికి ప్రజలే సమాధానం చెప్తారన్నారు. కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, టౌన్ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఆర్టీఐ చైర్మన్ రమేష్, ఉపాధ్యక్షుడు నాగశేష, ఉపాధ్యక్షుడు సుధాకర్, వెంకటయ్య, బాలపీరు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని బసవన్న గుడి వద్ద రూ.ఐదు లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

ఉపాధ్యాయులు లేక విద్యార్థుల అవస్థలు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు పాఠశాలల నుంచి ఇటీవల ఉపాధ్యాయులు బదిలీ కావడంతో విద్యార్థులకు విద్యాపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పౌజ్‌కు (భార్యాభర్తలు ఉపాధ్యాయులు ఒకే జిల్లాలో పనిచేయడానికి) అవకాశం ఇవ్వడంతో మండలం నుంచి ఏకంగా 11 మంది ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. కానీ మండలానికి ఒక్కరు కూడా రాలేదు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 30, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 6 మొత్తం 41 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం 193 ఉపాధ్యాయ పోస్టులను కేటాయించారు. ఉన్న పోస్టుల్లోనే 15 ఖాళీలు ఉండగా.. ఇటీవల అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు, పీఎస్ మామిడిమాడ 1, ఖిల్లాఘనపురం హరిజన్‌వాడ 1, ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాల 2, ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాల 1, పీఎస్ మానాజీపేట 1, పీఎస్ సోళీపురం 1, పీఎస్ ముందలితండా 1, బోడగట్టుతండా 1 మొత్తం 11 మంది వెళ్లిపోవడంతో మొత్తం ఖాళీలు 26 కు చేరింది. పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు వెళ్లిపోవడంతో సంబంధిత సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉన్నత పాఠశాలలో ఈ పరిస్థితి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పరీక్షల సమయంలో కాకుండా మరో నెల రోజుల తరువాత బదిలీలు చేపట్టి ఉంటే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేదని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ జయశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన స్పౌజ్ అవకాశాన్ని ఉపాధ్యాయులు వినియోగించుకుని వెళ్లిపోయారని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకుల ప్రయోజనాలను విస్మరించి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ఇందుకు నిరసనగా గురువారం సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేశారని, ఉపాధిహామీ కూలీల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారని సీపీఎం జిల్లా నాయకుడు మంద కృష్ణయ్య అన్నారు. ప్రత్యేక పద్దుల ద్వారా తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపు జరపాలని, లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు మురళి, రవి, బాలగౌడ్, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, హుస్సేన్, నిరంజన్, మౌలాలి, రామకృష్ణ, నవీన్ ఉన్నారు.

కొనసాగుతున్న మధుమేహ పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని గ్రామ, గ్రామాన నిర్వహిస్తున్న మధుమేహ (షుగర్) నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. మూడో రోజు గురువారం మండల కేంద్రంలో మధుమేహ పరీక్షలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకుంటూ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 796 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

వరప్రసాదరావుకు సన్మానం

కొత్తకోట రూరల్: ఇటీవల వనపర్తి జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అధ్యక్షుడిగా ఎన్నికైన సూగూరు వరప్రసాదరావును గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల, మోజర్ల హైస్కూల్ ఉపాధ్యాయ బృందం, స్కూల్ కాంప్లెక్స్‌లోని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, తపస్ వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పక్షపాతి, నిరంతరం ఉపాధ్యాయుల యొక్క సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపే నాయకుడు ఎస్.వరప్రసాదరావు అని కొనియాడారు.

‘ఓటీఎస్’ సద్వినియోగం చేసుకోవాలి

కొత్తకోట రూరల్: పెద్దమందడి ప్రాథమిక సహకార సంఘంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులను రుణ విముక్తులను చేసేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ ప్రకటించిన వన్ టైం సెటిల్మెంట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. పెద్దమందడి సొసైటీలో 218 మంది రైతులు రూ.4.16కోట్ల దీర్ఘకాలిక రుణాల కింద అప్పు తీసుకోగా.. రూ.2.24కోట్లు మాఫీ చేశామన్నారు. జనవరి 15నుంచి ఫిబ్రవరి 15వరకు వన్ టైం సెటిల్మెంట్ ప్రకటించగా బుధవారం వరకు రూ.49.57లక్షలు చెల్లించారని, వీరందరికీ రూ.51.22లక్షల సబ్సిడీ వర్తించిందన్నారు. ఏకకాలంలోనే పెద్ద మొత్తంలో అప్పు చెల్లించిన వారిని సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మంగంపల్లి వెంకట్రాంరెడ్డి, యాపర్ల రాంరెడ్డి, సొసైటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సైదయ్య

కొత్తకోట: మున్సిపల్ నూతన కమిషనర్‌గా సైదయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, అయ్యన్న, సంధ్యశ్రీను, వసీమ్, వినోద్ సాగర్, డాక్టర్ సాజిద్ అలీ, సాధిక్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా పోరాటాలకు మద్దతునిస్తాం



వీపనగండ్ల: గ్రామ స్థాయిలో బడుగు, బలహీన వర్గాల ప్రయోజనం కోసం నిర్వహించే ప్రజా పోరాటాలకు సీపీఎం రాష్ట్ర నాయకత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలియజేసినట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్, ఎండీ అబ్బాస్, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎంపికైన జాన్‌వెస్లీని మండల నాయకులతో కలిసి వారికి అభినందనలు తెలియజేశారు. గ్రామ స్థాయిలో నిర్వహించే ఆందోళనలో ప్రతి కార్యకర్త పాల్గొనే విధంగా చూడాలని ఆయన కోరినట్లు వారు తెలిపారు. జాన్‌వెస్లీని కలిసిన వారిలో కృష్ణయ్య, మురళి, రవిప్రసాద్, ఆశన్న, బాలగౌడ్, నిరంజన్, వెంకటేశ్వర్లగౌడ్, సీహెచ్ వెంకటయ్య, బాలస్వామి, లక్ష్మణ్, రామకృష్ణ ఉన్నారు.

‘పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని ఆందోళన’

అమరచింత: మండల కేంద్రంలోని బాలాజీ ఫిల్లింగ్ కేంద్రంలో గురువారం పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్‌స్వామి గురువారం తన మోటర్ సైకిల్‌కు బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్‌లో లీటరు పెట్రోల్ పోయించాడు. మోటర్ సైకిల్ కొద్ది దూరం వెళ్లి ఆగిపోవడంతో మెకానిక్ దగ్గరికి తీసుకెళ్లగా.. పెట్రోల్‌లో నీళ్లు ఉన్నాయని చెప్పడంతో వాటిని బాటిల్‌లో పోసుకుని బంక్ వద్దకు వచ్చి వాదనకు దిగాడు. బంకు యాజమాని శంకర్‌నాయక్ తమ బంక్‌లో కల్తీ జరగదని బకెట్‌లో పెట్రోల్ నింపి చూపించాడు. ఎవరో గిట్టని వ్యక్తులు ఇలా తమ బంక్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

హాస్టల్ నుంచి హైదరాబాద్ వెళ్లిన విద్యార్థి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థి మరణించిన విషయం మరువకముందే.. అదే హాస్టల్‌లో మరో ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తకోట మండలంలోని ముమ్మాలపల్లికి చెందిన సందీప్ స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రాథమిక పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే బుధవారం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత బస్టాండుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి.. బస్టాండులోని ఓ షాపులోని వ్యక్తితో అతడి తండ్రి కురుమూర్తికి ఫోన్‌కాల్ చేసి రూ.200 ఫోన్‌పే చేయించుకుని డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత విద్యార్థి తిరిగి హాస్టల్‌కు వెళ్లలేదు. గురువారం ఉదయం వరకు విద్యార్థి రాకపోయేసరికి హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్ సంతోష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ నరేష్ సీసీ కెమెరాల ద్వారా కుటుంబ సభ్యులు, తెలిసిన వారి వద్ద ఆరా తీశారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత విద్యార్థి సందీప్ తండ్రి కురుమూర్తికి ఇటీవల సస్పెండ్ అయిన హాస్టల్ వార్డెన్ జైపాల్‌రెడ్డి ఫోన్‌కాల్ చేసి బాబు హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండులో కనిపించాడని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విద్యార్థి గతంలో కూడా ఒకసారి వార్డెన్‌కు చెప్పకుండా హైదరాబాద్ వెళ్లాడని తెలిసింది.

బీసీ కులగణన బిల్లు ఆమోదంపై హర్షం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు పెద్దమందడి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్సు, ఉచిత కరెంటు, రూ.500 కు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతులకు రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఎస్సీ వర్గీకరణ ఆమోదం, బీసీ రిజర్వేషన్ చర్చ, కులగణన సర్వే, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్, అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. మాదిగల 30ఏళ్ల పోరాటం, మాదిగ అమరవీరుల త్యాగం, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింపజేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, పెంటన్నయాదవ్, వెంకటస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ వాకిటి నరేష్, మాజీ సర్పంచ్‌లు గట్టు మన్యం, వాకిటి శ్రీనివాసులు, కొండ రవీందర్‌రెడ్డి, టైలర్ రవి, పవన్‌కుమార్‌రెడ్డి, పుల్లన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

‘తాగు, సాగునీటి ఇబ్బందులు రానివ్వం’

ఆత్మకూర్: వేసవిలో తాగు, సాగునీటి కష్టాలు రానివ్వకుండ కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తుగా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారని నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నేతృత్వంలో రాష్ట్ర మంత్రులు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను కలిసి ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారని అన్నారు. అందుకు స్పందించి నారాయణపూర్ డ్యాం నుంచి 4 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు సానుకూలత తెలిపి నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటి కష్టాలు రాకముందే ఎమ్మెల్యే ముందస్తుగా చర్యలు తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ముస్తాబైన అమ్మవారి ఆలయం

కొత్తకోట: పట్టణ నడిగడ్డలో వెలసిన శ్రీ భవానిశంకర్ అమ్మవారి పండుగ అత్యంత వైభవోపేతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయం, పట్టణ వీధులను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వేడుకలు 8న కలశ ఊరేగింపు, 9న చండీహోమం, 10న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో మూడు రోజులు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. వేడుకకు పట్టణంలోని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు ఇంటింటికీ ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా అమ్మవారి కార్యక్రమానికి వచ్చే భక్తులకు అన్నదానం, తాగునీరు తదితర సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న డా.నందకిషోర్



గోపాల్‌పేటలో డాక్టర్ కృష్ణకుమారి



పాన్‌గల్‌లో సీహెచ్‌ఓ రామయ్య

ఆత్మకూర్: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఈ నెల 10న జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు, వైద్యాధికారి నందకిషోర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులతో సమావేశమై నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అల్బెండజోల్ మాత్రలను రెండేళ్ల చిన్నారులకు సగం మాత్ర, రెండేళ్లు పైబడిన వారికి 400 ఎంజీ ఇవ్వాలని, భోజనం చేసిన తర్వాతనే మాత్రలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ విద్యాసాగర్, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాన్‌గల్: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 10, 17వ తేదీల్లో విద్యార్థులకు పంపిణీ చేసే నులిపురుగుల నివారణ మాత్రలపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో హెచ్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య మాట్లాడుతూ.. ఈ మాత్రలు విద్యార్థుల ఎదుగుదలకు దోహదం చేస్తాయన్నారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు సగం మాత్ర (200 ఎంజీ), రెండేళ్లకు పైబడిన వారికి ఒక మాత్ర(400ఎంజీ) ఇవ్వాలన్నారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఈఓ శ్రీనివాసులు, డీటీ అశోక్‌నాయుడు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ నులిపురుగులను నివారించేందుకు విద్యార్థులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిద్ధగౌడ్ పాల్గొన్నారు.